క్లుప్తంగా

పాలిసెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి

నందిగామ: పాలిసెట్ – 2023 పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పట్టణంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ బాబు మంగళవారం తెలిపారు. పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్ 2023 అర్హత పరీక్షల కోసం నందిగామ పట్టణంలో మొత్తం ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని చెప్పారు. దీనికోసం పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, కేవీఆర్ కళాశాల, డీవీఆర్ జూనియర్ కాలేజ్, ఎంఆర్‌ఆర్ కళాశాల, శ్రీవిద్య పాఠశాల, నారాయణ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 10 గంటలకల్లా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు పెన్సిల్, పెన్, ప్యాడ్ తదితర సామగ్రి వెంట తెచ్చుకోవాలన్నారు. ఒక నిమిషం ఆలస్యమైన పరీక్షకు అనుమతించామన్నారు.

కొనసాగుతున్న పేరంటాళ్లమ్మ తిరునాళ్ల

నందిగామ: మండలంలోని లింగాలపాడు గ్రామంలో శ్రీ లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి విశేష పూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వీధి లైట్ల సమస్యకు పరిష్కారం




జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని 1వ వార్డులో కొన్ని రోజులుగా పలు చోట్ల వీధిలైట్లు వెలగక పోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీనిపై స్థానికుల ఫిర్యాదు మేరకు మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్‌బాబు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో మాట్లాడి మున్సిపల్ సిబ్బందిని పిలిపించి వీధిలైట్లను బాగుచేయించారు. అలాగే పాడైపోయిన వీధిలైట్ల స్థానంలో కొత్త లైట్లను అమర్చారు. అన్ని వీధిల్లో లైట్లను వెలిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో వార్డు వాసులు హర్షం వ్యక్తం చేశారు.

బాలాంజనేయ స్వామి ఆలయంలో విశేష పూజలు



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని డాంగేనగర్ కాలనీలో వేం చేసి ఉన్న పంచముఖ శ్రీబాలాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం జరగనున్న హనుమజ్జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆలయానికి రంగులు వేయించి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చకులు బృందావనం ధన్వంతరి ఆచార్యులు పర్యవేక్షణలో పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం, వివిధ రకాల పండ్లను సమర్పించి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా వైఎస్ జగన్ ప్రభుత్వం



మైలవరం: అన్నదాతలకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మైలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మైలవరం మార్కెట్ యార్డులో స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అన్నదాతలు కష్టపడి పండించిన పంటను దళారులకు అమ్మవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకోని, ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర పొందాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇటీవల అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృతనిశ్చయంతో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు
- ఉత్సాహంగా 'గడప గడపకు మన ప్రభుత్వం'



పెద్దాపురంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు, నాయకులు

పెద్దాపురం(వీరులపాడు): రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో మంగళవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి సంక్షేమ పథకాలు అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను పంపిణీ చేశారు.

ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రజలను మోసగించి వంచన పాలన సాగిస్తే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ప్రజలకు మంచి చేసే సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని కొనియాడారు. ప్రజా సంకల్ప పాదయాత్ర, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేయటంతో పాటు చెప్పాడంటే చేస్తాడంతేతో మంచి పేరు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలకు సాధ్యం కాని రీతిలో ప్రతి ఒక్క ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి తమ దృష్టికి వచ్చిన ప్రతి ఒక్క సమస్యను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమస్యలు పరిష్కరించేందుకే ఒక్కో సచివాలయానికి సీఎం వైఎస్ జగన్ ప్రత్యేకంగా రూ.20 లక్షల నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు మంచి చేయాలనే తపనతో పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, మాజీ సర్పంచ్ ఆవుల మాధవి, ఉప సర్పంచ్ బవిరిశెట్టి లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణరెడ్డి, పార్టీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్ద పీట

ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు



మత్స్యకారులకు ద్విచక్ర వాహనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

కంచికచర్ల: మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మత్స్యకారులకు ప్రభుత్వం రాయితీపై మంజూరు చేసిన ద్విచక్ర వాహనాలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేపల వేటే జీవనాధారంగా బతుకుతున్న మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచేలా ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేస్తోందన్నారు. వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం రాయితీపై ద్విచక్ర వాహనాలు, ఐస్ బాక్సులు, ఫిష్ ఆంధ్ర, వేట పనిముట్లు, పరికరాలు అందజేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మత్స్యకార సంఘ సభ్యులకు జిల్లాలో 22 ద్విచక్ర వాహనాలు సబ్సిడీపై మంజూరయ్యాయని వాటిలో నాలుగు కంచికచర్ల మండలం కునికెనపాడు మత్స్యకార సంఘానికి, వీరులపాడు మండలం జయంతి గ్రామానికి ఒక ద్విచక్ర వాహనం కేటాయించామన్నారు. మత్స్యకార సహకార సంఘ సభ్యులు, జాలర్లు, మత్స్యశాఖ నుంచి లైసెన్స్ పొందిన మత్స్యకారులు సబ్సిడీ వాహనాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, ఎంపీటీసీ సభ్యుడు నన్నపనేని నరసింహరావు, సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీడీఓ కె.బాలశంకరరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, నాయకులు వేల్పుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా రహదారికి మరమ్మతులు



రహదారి పనులకు కొలతలు వేస్తున్న సిబ్బంది

కంచికచర్ల: ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రహదారికి మరమ్మతు పనులు చేపడుతున్నామని ఉప సర్పంచ్ వేమా సురేష్‌బాబు అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) కార్యాలయం వరకు రహదారికి మంగళవారం మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వేమా మాట్లాడుతూ.. కంచికచర్ల నుంచి వీరులపాడు మండలం పెద్దాపురం వరకు రూ.18 కోట్ల నిధులతో తారురోడ్డు నిర్మాణ పనులు ప్రభుత్వం చేపట్టిందన్నారు. అయితే కంచికచర్లలో సెబ్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు కాంట్రాక్టర్ వైఫల్యంతో పనులు నిలిచిపోయాయని ఈ విషయం గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్‌లు ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడారన్నారు. ప్రభుత్వం నుంచి రూ.15 లక్షలు మంజూరు చేయించారని అన్నారు. ప్రస్తుతం ప్రయాణికులు, వాహనదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్యాచ్ వర్క్ జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కోయా సుబ్రహ్మణ్యం, మంగినేని శ్రీనివాసరావు, శేషం వాసుబాబు, దేవరకొండ గురవయ్య, గ్రంధి ఆదిత్య పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయానికి విరాళాలు



ఆలయ చైర్మన్ చెన్నకేశవరావుకు విరాళం అందజేస్తున్న శేషగిరిరావు దంపతులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారికి మంగళవారం పలువురు భక్తులు విరాళాలను ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావుకు అందజేశారు. ఆలయంలోని శ్రీఅంకమ్మవారి ఉపాలయం గోపురం వెండి తాపడానికి తూర్పు గోదావరి జిల్లా, రావులపాలెం మండలం, ఏనుగు మహల్‌కు చెందిన వి.శేషగిరిరావు దంపతులు రూ.10 వేలు, తెలంగాణా రాష్ట్రం, సూర్యాపేటకు చెందిన పిల్లుట్ల శ్రీహరి దంపతులు రూ.10 వేలు, గోశాలలోని గోవుల సంరక్షణకు రూ.10 వేలు అందజేశారు. మండలంలోని గుమ్మడిదూర్రు గ్రామానికి చెందిన కొత్తపల్లి పుల్లారావు, విజయలక్ష్మి దంపతులు వెండి తాపడానికి రూ.11,016లు అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలను అందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'జగనన్నకు చెబుదాం'



సీఎం వైఎస్ జగన్ కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో వీక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పెనుగంచిప్రోలు: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం అనే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. కార్యక్రమ వెబ్‌సైట్ ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగాన్ని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వారు వీక్షించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందడంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ ద్వారా పరిష్కారం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్, ఏఓ సిద్దారెడ్డి, ఈవోపీఆర్డీ శ్యామ్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం



పేట గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 స్థాయి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడం, పుస్తక సమీక్ష, బొమ్మలు తయారుచేయడంలో శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు తాము చదివిన పుస్తకాలను సమీక్షించడం, కథలు చెప్పించారు. బీడీసీ(బుక్ డిపాజిట్ సెంటర్) మల్లిక క్రాఫ్ట్ నేర్పించగా, తెలుగు వ్యాకరణం అంశాలను తెలుగు ఉపాధ్యాయుడు దోసపాటి నాగేశ్వరరావు వివరించారు. అనంతరం పిల్లలతో బొమ్మలు తయారుచేయించడం నేర్పించారు. రెండో రోజు సమ్మర్ క్యాంప్‌లో 50 మంది విద్యార్థులు పాల్గొనగా, గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సిబ్బంది పర్యవేక్షించారు.

మనుషుల అక్రమ రవాణాపై అవగాహన

రెడ్డిగూడెం: ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ద్వారా వైఎస్సార్ క్రాంతి పథకం డీఆర్‌డీఏ సహకారంతో మండల పరిషత్ కార్యాలయం నందు మంగళవారం మనుషుల అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏపీఎం బి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా అంశం ప్రపంచంలోనే అతిపెద్ద నేరమన్నారు. ప్రతి రోజు ఏదో ఒక ప్రాంతంలో అమ్మాయిలు, మహిళలు అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నేర్చుకున్న అంశాలను సమాజంలో అమలు చేయాలని, ప్రతి గ్రామంలో ఇలాంటి కార్యక్రమాలను చేయటానికి ప్రజలు అప్రమత్తం చేయటానికి మా సహకారం ఉంటుందన్నారు. ప్రతి మహిళ సంఘ సభ్యులు తమ పరిధిలోని అన్ని వర్గాల ప్రజల సామాజిక ఆర్థిక స్థితిగతులపై అవగాహన పెంచుకొని అందరినీ అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రజ్వల సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామ్ మాట్లాడుతూ.. ఐసీడీఎస్, పోలీస్, విద్యాశాఖల సమన్వయంతో ఇప్పటి వరకు 26,500 మంది అమ్మాయిలను, మహిళలను కాపాడి వారికి పునరావాసం కల్పించామన్నారు. కార్యక్రమంలో ప్రజ్వల సంస్థ ప్రతినిధులు ఎం.సురేష్‌కుమార్, టి.శ్రావ్య, జె.వినోద్ పాల్గొన్నారు.

గంగుల గోపి నగర బహిష్కరణ

ఇబ్రహీంపట్నం: పశ్చిమ ఇబ్రహీంపట్నానికి చెందిన గంగుల గోపి అలియాస్ గోపిచంద్‌ని నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా మంగళవారం నగర బహిష్కరణ చేశారు. 29 ఏళ్ల వయసు కలిగిన గంగుల గోపి గతంలో నేరాలు చేసి జైలుకు వెళ్లి వచ్చాడు. బయటకు వచ్చిన తర్వాత కూడా అతనిలో మార్పు లేకుండా ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధి నుంచి నగర బహిష్కరణ చేసినట్లు ఒక ప్రకటనలో సీపీ వెల్లడించారు.

ఉపాధి కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

మొర్సుమల్లి(మైలవరం): ఉపాధి హామీ కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ జే.సునీత ఆదేశించారు. మైలవరం మండలం మొర్సుమల్లిలోని కురివిడి చెరువులో ఉపాధి హామీ పథకంలో భాగంగా అమృత్ సరోవర్ ట్యాంక్ పనులను పీడీ సునీత మంగళవారం పరిశీలించారు.

టెంట్‌లు ఏర్పాటు చేయాలి

పీడీ సునీత మాట్లాడుతూ ఉపాధి కూలీలకు తాగునీరు, ఫస్ట్‌ఎయిడ్ కిట్‌లు అందుబాటులో ఉండాలని, కూలీలు కొద్ది సేపు విరామం తీసుకునేందుకు టెంట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి పనుల ద్వారా చెరువులు, కాలువలు బాగు చేసుకోవాలని, తద్వారా పంటలకు పుష్కలంగా సాగునీరు అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ నాయకుడు మాడపాటి శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఇన్‌చార్జి వీరమల్లు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయండి



ప్రశంసా పత్రాలు, నగదు అందజేస్తున్న ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వరరావు

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ సంస్థ పురోభివృద్ధికి ఉద్యోగులు సమైక్యంగా కృషి చేయాలని ఆర్టీసీ జోనల్–2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు సూచించారు. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో సంస్థ అభివృద్ధిలో ప్రతిభచాటిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో ఆయన ముఖ్యఅతిథిగా మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపో అభివృద్ధి బాటలో నడవాలంటే ఉద్యోగులు సహకారం ముఖ్యమన్నారు. ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తామన్నారు. ఏప్రిల్ నెలలో ప్రతిభ చూపిన ఆదర్శ డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు మొత్తం 16 మంది ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలు అందజేశారు. డిపో మేనేజర్ ఏ.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ విప్ ఉదయభాను



శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

పెనుగంచిప్రోలు: ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను తెలిపారు. స్థానిక జేజీఎం చర్చి ఆవరణలో జేజీఎం, హైదరాబాద్‌కు చెందిన ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం వైద్యానికి గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. ప్రతి పేదవాడికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపడుతుందని చెప్పారు. చర్చి తరుపున గతంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలు అందిస్తున్న వైద్య సేవలు మరువలేనివన్నారు. నిర్వాహకులను అభినందించారు. శిబిరంలో పాల్గొన్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించటంతో పాటు మందులు అందజేశారు. కార్యక్రమంలో మైనింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల రామారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేల్పుల రవికుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, ప్రముఖ వైద్యులు జంపాల శ్రీనివాస్, పాస్టర్ ఎం.జోసఫ్ పాల్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం పాలన



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కొణతాలపల్లి(వీరులపాడు): రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మి రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మండలంలోని కొణతాలపల్లి గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. రైతులు దళారుల మోసానికి గురికాకుండా కొనుగోలు కేంద్రాల్లో పంటలు విక్రయించుకోని మద్దతు ధర పొందాలని సూచించారు. మొక్కజొన్నకు క్వింటాకు రూ.1962ల మద్దతు ధరను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. రైతులు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచ్ నంద్రు సౌజన్య, ఎంపీటీసీ సభ్యురాలు అయిలూరి వెంకట్రావమ్మ, సొసైటీ చైర్మన్ బొగ్గుల ఓబుల్‌రెడ్డి, నాయకులు అయిలూరి నర్సిరెడ్డి, గాంధీ, సంఘ కార్యదర్శి సర్దార్ సాహెబ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

నందిగామ: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందజేయాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం కోరారు. పట్టణంలోని 5వ వార్డులో మంగళవారం ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఇందులో భాగంగా డ్రెయిన్లలో పూడిక తీతలు, పిచ్చి మొక్కల తొలగింపు, బ్లీచింగ్ చల్లించడం, ఫాగింగ్ తదితర కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు కూడా సహకరిస్తే పట్టణాన్ని స్వచ్ఛ నందిగామగా ఆదర్శవంతంగా తీర్చిదిద్దవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి మురళి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



రామన్నపేట రహదారిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

నందిగామ: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే ఉపేక్షించేది లేదని ఇన్‌స్పెక్టర్ సతీష్ హెచ్చరించారు. పట్టణంలోని చందర్లపాడు రోడ్డు, రామన్నపేట రహదారుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్న ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో రహదారికి ఇరువైపులా ఉన్న తోపుడుబండ్ల వ్యాపారులను ఆ ప్రాంతాల నుంచి తరలించారు. అదే విధంగా నిర్లక్ష్యంగా పార్క్ చేసిన వాహన యజమానులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ప్రతి రోజు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని సూచించారు. ఆయన వెంట ఎస్‌ఐ పండు దొర, ఏఎస్‌ఐ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో మజ్జిగ పంపిణీ



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణ పద్మశాలీ సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో ఆయుర్వేద మజ్జిగ పంపిణీ కార్యక్రమం కొనసాగింది. 17వ రోజైన మంగళవారం ఆర్‌ఎంపీ వైద్యుడు జల్లా వెంకటేశ్వరరావు సహకారంతో 2 వేల మందికి పంపిణీ చేశామని సంఘం అధ్యక్షుడు పెనుమల్లి చంద్రమౌళి చెప్పారు. తొలకరి వర్షాలు పడి వాతావరణంలో మార్పు వచ్చేంత వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సభ్యులు ఏశాల సీతారామమూర్తి, యలగందుల శ్రీనివాసరావు, భారత జగన్, అల్లి రవిచంద్, లక్ష్మీ కిషోర్, బొట్ల వీరభద్రం, పొట్టాబత్తిన రఘు, యాపిల్ ల్యాబ్ శ్రీను, పెనుమల్లి రాంబాబు, చిలక వెంకటేశ్వర్లు, కర్నాటి రాజేశ్వరి, పాపాని రాజేశ్వరి, బొడ్డు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వీరులపాడు పీఎస్‌లో ఏసీపీ ఆకస్మిక తనిఖీ

వీరులపాడు: పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారి పట్ల మర్యాదగా నడుచుకోవాలని ఏసీపీ జనార్దన్ నాయుడు పేర్కొన్నారు. వీరులపాడు పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఏసీపీ మాట్లాడుతూ పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయటంతో పాటు మండలంలో నేరాల శాతం తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గతంలో మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను ఆయన పరిశీలించారు. ఎస్‌ఐ మహాలక్ష్మణుడు, సిబ్బంది పాల్గొన్నారు.